క్లుప్తంగా

17న చలో ఐటీడీఏ



సంతలో ప్రచారం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయ రూరల్: ఈనెల 17న చేపట్టనున్న చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిజన సంఘం నాయకులు శనివారం లోతేరు వారపు సంతలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి రామన్న మాట్లాడుతూ మన్యంలో 11 మండలాల పరిధిలో ఉన్న కాఫీ రైతులకు ఐటీడీఏ నుంచి ఇవ్వాల్సిన ప్రోత్సాహక నిధులు తక్షణం చెల్లించాలన్నారు. కాఫీ రైతులకు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కాఫీ రైతులను ఆదుకోవాలనే డిమాండ్‌తో చలో ఐటీడీఏ కార్యక్రమం చేస్తున్నామన్నారు. నాయకులు లైకోన్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గిరిజన విద్యార్థి ప్రతిభ

డుంబ్రిగుడ: జేఈఈ మెయిన్స్‌లో డుంబ్రిగుడకు చెందిన కమిడి అక్షయ్‌కుమార్ సత్తాచాటాడు. 86.54 పర్సంటైల్ సాధించాడు. విశాఖపట్నం శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుకుంటున్నాడు. అక్షయ్‌కుమార్ టెన్త్ అరకులోయ సెయింట్ జోసెఫ్ పాఠశాలలో అభ్యసించారు. జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన గిరిజన విద్యార్థి అక్షయ్‌కుమార్‌కు తల్లిదండ్రులు సంజీవరావు,ధనలక్ష్మి దంపతులతో పాటు అధికారులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

బకాయిల వసూళ్లకు చర్యలు

గంగవరం: మండల పరిధిలోని మొల్లేరు ప్రాథమిక సహకారం సంఘం(పీఏసీఎస్) నుంచి రుణాలు పొంది దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉంచిన రైతులు తమ బకాయిలను వెంటనే చెల్లించాలని సొసైటీ సీఈఓ బొల్లవరపు జయరాజ్ అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సొసైటీ పరిధిలో గత మూడేళ్లుగా నిలిచిపోయిన బకాయిల వసూళ్లకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ మేరకు గ్రామాల్లో మైకు ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. సొసైటీ ద్వారా రుణాలు పొందిన రైతులు త్వరితగతిన బకాయిలు చెల్లించాలని లేనిపక్షంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధికారుల ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పవనగిరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో శనివారం కుజ గ్రహ దోష నివారణ పూజలు నిర్వహించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకరామయ్య ఆధ్వర్యంలో కుజ గ్రహ దోష నివారణ, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సకల దోష నివారణకు సంబంధించి లోక కళ్యాణార్థం వివిధ దేవాలయాల్లో అభిషేకాలు,అర్చనలు, హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు ఊడపాలెంలో కంటి వైద్య శిబిరం

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పంచాయతీ ఊడపాలెం గ్రామంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుంది. అలోక విజన్, ఎస్.ఆర్.వంకరస్ తాత ఆటలబడి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించే శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేస్తామని నిర్వాహకులు పి.నాగరాజు, పాంగి మత్స్యరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆపరేషన్ తప్పనిసరిగా అవసరమైతే వారిని గుర్తించి చికిత్సకు తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

అనంతగిరి: మండలంలోని అనంతగిరి పంచాయతీ రాజుపాక గ్రామంలోని తాగునీటి సమస్య పరిష్కరించాలని జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు కోరారు. ఆయన శనివారం మాట్లాడుతూ గ్రామంలో గతంలోని ఏర్పాటు చేసిన తాగునీటి పథకం పాడవడంతో స్థానికులు తాగునీటి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పాఠం..దృశ్య రూపం

- పాఠ్యపుస్తకాల్లో క్యూఆర్ కోడ్
- స్కాన్ చేస్తే సెకన్లలో సందేహాల నివృత్తి
- విద్యార్థులకు సులభతరంగా మారిన నూతన విధానం



క్యూఆర్ కోడ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు



క్యూ ఆర్ కోడ్‌తో ముద్రించిన పాఠం

ముంచంగిపుట్టు: ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చింది. కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడుల్లో నదుపాయాలు దర్శనమిస్తున్నాయి. దీంతో పాటు నాణ్యమైన విద్య కోసం నూతన విద్యా విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. విద్యార్థులకు సులభరీతిలో పాఠాలు అర్థమయ్యేలా సాంకేతిక విజ్ఞానాన్ని అమలు చేస్తోంది. విద్యార్థులు పాఠ్యాంశాలను అర్థం చేసేకునేందుకు పాఠ్యపుస్తకాల్లో వీడియో రూపంలో అందుబాటులోకి తీసుకువచ్చింది. కొంతమంది విద్యార్థులు విని నేర్చుకుంటే, కొందరు చూసి నేర్చుకుంటారు.. దృశ్య రూపం కచ్చితంగా విద్యార్థులకు ఎప్పటికి జ్ఞాపకం ఉంటుంది. సాధారణంగా పాఠశాలలో ఉపాధ్యాయుడు పాఠ్యాంశం బోధించేటప్పుడు విద్యార్థికి ఎన్నో సందేహాలు వస్తుంటాయి. నివృత్తి చేసుకులేక ఇబ్బందులు పడుతుంటారు.. అయితే ప్రస్తుతం ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ×క్యూ ఆర్‌÷ కోర్ విద్యార్థులకు వరం.. కోడ్‌ను స్కాన్ చేస్తే పాఠానికి సంబంధించి అన్ని సందేహాలు నివృత్తి అవడంతో అదనపు సమాచారం అందుతుంది. రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా పాఠ్యపుస్తకాల్లో క్యూఆర్ కోడ్ పొందుపరిచారు.

క్యూఆర్ కోడ్‌తో పాఠ్యపుస్తకాలు

విద్యార్థుల సర్వతో ముఖావృద్ధిని కాంక్షించే ప్రభుత్వం వారి కోసమే ప్రతి పాఠ్యాంశానికి క్యూఆర్ కోడ్ రూపొందించింది. గతంలో పాఠ్యపుస్తకంలో మొదటి, చివరి పేజీల్లో మాత్రమే క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉండేది. ఈ విధానం వల్ల విద్యార్థులకు ప్రయోజనం శూన్యంగా ఉండేది. దీంతో ప్రభుత్వం కొత్తగా ప్రతి పాఠ్యాంశంపై క్యూ ఆర్ కోడ్‌ను ముద్రించింది. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ పాఠ్యపుస్తకాల్లో ప్రస్తుతం క్యూ ఆర్ కోడ్ దర్శనమిస్తోంది. ఈ కోడ్‌ను విద్యార్థులు స్మార్ట్ ఫోన్‌లో స్కాన్ చేసి పాఠ్యాంశాలను చూస్తూ, వింటూ అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి ఇప్పటికే ఈ పాఠ్య పుస్తకాలను విద్యాశాఖ అధికారులు పంపిణీ చేశారు.

స్కాన్ చేస్తే వీడియో పాఠం ప్రత్యక్షం

విద్యార్థులు ఏ కారణంతోనైనా పాఠశాలకు హాజరు కాక ఏ పాఠ్యాంశాన్ని అయినా కోల్పోయినా క్యూ ఆర్ కోడ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత సందేహించాల్సిన అవసరం లేదు. పాఠ్యాంశాన్ని ఎప్పుడు కావాలంటే అప్పుడు క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వీడియో రూపంలో చూడవచ్చు. పాఠ్యాంశాన్ని స్కాన్ చేసి డౌన్‌లోడ్ చేసుకొనే వెసులుబాటు సైతం ఉంది. దీని వల్ల ఒక్కసారి స్కాన్ చేసి డౌన్‌లోడ్ చేసుకుంటే ఆ పాఠ్యాంశం వారి ఫోన్ గ్యాలరీలో సేవ్ అవుతుంది. దానిని విద్యార్థులు ఆఫ్‌లైన్‌లో చూసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నూతన విధానంపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఉపయోగంగా ఉంది



పాఠ్యాంశంలో సందేహాన్ని నివృత్తి చేసుకునేందుకు క్యూ ఆర్ కోడ్ విధానం ఆసరాగా ఉంటుంది. ఒక అంశానికి సంబంధించిన పూర్తి వివరణ వీడియో రూపంలో ఉండడంతో పదే పదే చూడాలనిపిస్తోంది. దీంతో పూర్తిస్థాయిలో పాఠ్యాంశాలపై అవగాహన కలుగుతుంది. పాఠాలు చాలా బాగా అర్థమవుతున్నాయి.ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– కె.నవీన్‌కుమార్, విద్యార్థి, పదో తరగతి, జీటీడబ్ల్యూఏ బాలుర పాఠశాల–1, ముంచంగిపుట్టు

అవగాహన కల్పిస్తున్నాం



క్యూ ఆర్ కోడ్ విధానంలో పాఠ్యాంశాలపై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. పాఠ్యాంశాలు వీడియోల రూపంలో ఉండడం వల్ల త్వరగా అర్థమవుతాయి. అలాగే మెదడులో నిక్షిప్తమైన వీడియోలు పునశ్చరణ సమయంలో గుర్తుకు వచ్చి విద్యార్థుల ఉత్తీర్ణతకు దోహదపడతాయి. క్యూ ఆర్ కోడ్ పాఠ్యాంశాలపై ప్రతి తరగతిలో విద్యార్థులకు అవగాహన కలిస్తున్నాం.

– కె.భాగత్‌రాం, స్కూల్ అసిస్టెంట్, జీటీడబ్ల్యూఏ బాలుర పాఠశాల–1, ముంచంగిపుట్టు

గ్రామాల్లో వైద్య శిబిరాలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రేమ



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు నాయుడు

డుంబ్రిగుడ: మండలంలోని కితలంగి పంచాయతీ పాడి గ్రామంలో వైద్యాధికారి ప్రేమ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రేమ మాట్లాడుతూ గ్రామంలో ఎవరికి ఆరోగ్యం బాగోలేక పోయిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో వచ్చి వైద్య పరీక్షలు పొందాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు సాంబశివరావు, పద్మ, రత్నం సిబ్బంది పాల్గొన్నారు.

గోపవరంలో..

కొయ్యూరు: చిట్టింపాడు పంచాయతీ గోపవరంలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నర్సీపట్నానికి చెందిన సాయి సంజీవిని ఆస్పత్రి వైద్యుడు సుర్ల నాయుడు రోగులను పరీక్షించి, ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ సందర్భంగా మధుమేహంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఆహార నియమాన్ని పాటించి రోజూ వ్యాయామం చేస్తే చాలా వరకు డయాబెటిక్ నియంత్రణలో ఉంటుందని తెలిపారు. శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు, చిట్టింపాడు సర్పంచ్ నూకాలమ్మ, ఉప సర్పంచ్ మల్లేశ్వరి, వైద్య సిబ్బంది తులసి, సుస్మిత, ప్రసాద్, స్థానికులు గాంధీ, అప్పన్నబాబు, పొల్లుదొర, నాగరాజు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాల్గుణ పరామర్శ



చికిత్స పొందుతున్న అప్పలస్వామిను పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: అరకులోయ మండలం బస్కి వద్ద శనివారం జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మాజీ సర్పంచ్ అప్పలస్వామిని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పరామర్శించారు. బైక్‌పై ప్రయాణిస్తు జారిపడి గాయాలపాలైన అప్పలస్వామిని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే పాల్గుణ ఆస్పత్రికి చేరుకుని ఆయనను పరామర్శించారు.మెరుగైన వైద్యసేవలు కల్పించాలని వైద్యులను ఎమ్మెల్యే కోరారు.

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎంపీపీ వరహాలమ్మ, పక్కన హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

పెదబయలు: కాకినాడ మండలం జి.రాగంపేటలోని ఆయిల్ కంపెనీ జరిగిన ఘటనలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎంపీపీ వరహాలమ్మ అన్నారు. మండలంలోని పర్రెడ పంచాయతీ లక్ష్మీపురం, వంచేడిపుట్టు, బొండాపల్లి పంచాయతీ చంపాపుట్టు గ్రామాల్లో వారు శనివారం పర్యటించి, బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచిందని, అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నాయకులు సత్తిబాబు, సింహాచలం, చంద్రుబాబు, కొండయ్య, గంగాభవానీ తదితరులున్నారు.

దీన్ దయాల్ ఉపాధ్యాయకు ఘన నివాళి





మారేడుమిల్లి, గంగవరంలలో దీన్‌దయాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మారేడుమిల్లి: మండలంలోని కూడూరు గ్రామంలో శనివారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిన్నారెడ్డి, రామిరెడ్డి, బుల్లికొండలుదొర, బొజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మండలంలో పార్టీ అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు.కృష్ణారెడ్డి, శుభకృష్ణ, బొర్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని కొత్తాడ గ్రామంలో శనివారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ సిద్ధాంత కర్త, సంఘ సేవకుడు దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి జరిపారు. ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు కె.కాశీ విశ్వనాథరెడ్డి, సత్యనారాయణమ్మ, సూర్యచంద్ర, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఎస్.రాయవరం: కొరుప్రోలు కుమ్మరవీధిలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్స వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామునుంచి స్వామి సింధూర , తమలపాకు పూజలు నిర్వహించారు. గ్రామంలో ఏకైక దేవాలయం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు.మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

ఏఎస్ఐ జగత్‌రాయ్ మృతికి సంతాపం



జగత్‌రాయి (ఫైల్)

సీలేరు: సీలేరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న పాంగి జగత్‌రాయి అస్వస్థత కారణంగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయనకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది వైద్యం చేయించి అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు సీలేరు వచ్చి వైద్యం కోసం చింతపల్లి ఆస్పత్రికి తీసుకుని వెళ్లగా అక్కడ మృతి చెందారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. 1984 బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా భర్తీ అయి వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించి మంచి గుర్తింపు పొందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఈ మేరకు జీకే వీధి సీఐ అశోక్ కుమార్, సిబ్బంది మృతుడు జగత్‌రాయ్ కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియల నిమిత్తం రూ.25వేలు అందించారు. మృతదేహాన్ని అతని స్వగ్రామమైన అరకులోయ మండలం పద్మాపురం గ్రామానికి తరలించారు.

ఉపాధి పనుల కల్పనకు స్పెషల్ డ్రైవ్

పెదబయలు: మండలంలోని పర్రెడ గ్రామ పంచాయతీ లక్ష్మీపురం, వంచేడిపుట్టు గ్రామాలకు చెందిన గిరిజనులు కాకినాడ ఆయిల్ కంపెనీలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయా బాధిత కుటుంబాలను అరకు, పాడేరు ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు తమకు స్థానికంగా ఉపాధి పనులు కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ డ్వామా పీడీ, ఐటీడీఏ పీవోతో ఫోన్‌లో మాట్లాడి పనుల కల్పన కోసం వివరించారు. దీనిపై స్పందించిన అధికారులు మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ ద్వారా ఉపాధి పనులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ గ్రామస్తులు ఉపాధి కోసం వలస వెళ్లొద్దని స్థానికంగా పనులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పర్రెడ, బొండాపల్లి సర్పంచ్‌లు చెండా రవిశంకర్, బి.మత్స్యరాజు, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరావు, నాయకుడు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనకు సర్వత్రా ప్రశంసలు



ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను గిరిజనులకు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన దేశమంతటా ప్రశంసలు అందుకుంటోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో పెదలోచలి సచివాయం పరిధిలో చినసంగం, సాకిరేవు, చిందుగుల, బొర్రతాడి గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఆయా గ్రామాల్లో 140 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. గ్రామాల్లో గిరిజన మహిళలు ఎమ్మెల్యేకు సంప్రదాయ ప్రకారం పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు దేశంలోనే మిగిన రాష్ట్రాలు కూడా అమలు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడం సంతోషదాయకమన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా గ్రామ సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని ఆమె ఆదేశించారు. పారదర్శకంగా పథకాలు అమలుచేస్తూ, శివారు గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అధికారం అందించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఆమె కోరారు. వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు, లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, పెదలోచలి సర్పంచ్ బి.చినకుమారి, మండల కన్వీనర్లు కళ్యాణం, శివలింగంనాయుడు, టి.వరలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ బి కొండబాబు, నాయకులు వెంకటరమణ, చిట్టిబాబు, కామేశ్వరరావు, మహేష్, గృహసారధి శ్రీను, వివిధ శాఖల అధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌తో అభివృద్ధి కార్యక్రమాలు



జనమైత్రి కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ రాంబాబు

వై.రామవరం: మండలంలోని రాచపాలెంలో ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ అధ్యక్షతన జనమైత్రి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ వై.రాంబాబు మాట్లాడుతూ ప్రజలతో పోలీసులు సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగు కార్యక్రమం ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. యువత పెడతోవ పట్టకుండా కాపాడుకునే బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. వాహనచోదకులు తప్పనిసరిగా లైసెన్స్‌తో పాటు వాహన రికార్డులు కలిగి ఉండాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అసంఘిటత శక్తులకు సహకరించొద్దన్నారు. విద్యుత్ తీగలతో అడవి జంతువుల వేట నిషేధమని, అమర్చిన విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తాకి ఎంతో మంది అమాయక గిరిజనులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తెలియజేస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, సర్పంచ్ రోలిపల్లి నరసింహమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సచివాలయ మహిళా పోలీసు ఆర్.లోవకుమారి సహాయ సహకారాలు అందించారు. గ్రామ పెద్దలు, యువత, మహిళలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ సంప్రదాయాలను కొనసాగించాలి



ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీతారామన్నదొర

రంపచోడవరం: మండలంలోని మర్రివాడ గ్రామంలో ఆదివాసీ సంప్రదాయ వేడుక రాజులబాబు పండగ శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి కన్వీనర్ కారం సీతారామన్న దొర (డిల్లీబాబు) హాజరయ్యారు. పండగ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీతారామన్న దొర మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను ఇదే విధంగా కొనసాగించాలని కోరారు. ఆదివాసీ తెగల అస్థిత్వ రక్షణకు తన వంతు ప్రయత్నిస్తానన్నారు. గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. సర్పంచ్ యరగ్రౌండ రాజారావుగారు, అబ్బులు, జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కారం గంగాధరరావు, ఉపాధ్యక్షుడు సారపు ప్రతాప్ దొర, గ్రామ పెద్దలు రామాయమ్మ, పెద పండయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణ, సత్యనారాయణ రెడ్డి, చిన్నబ్బాయి దొర, రాంబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఐటీడీఏ క్వార్టర్స్



శిథిలస్థితిలో ఉన్న ఐటీడీఏ క్వార్టర్స్

అనంతగిరి: మండల కేంద్రంలోని ఉద్యోగులకు ఉండేందుకు నివాస గృహాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నివాసగృహాలు లేకపోవడంతో ఉద్యోగులు మైదాన ప్రాంతాలు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. మండల ఉద్యోగులు సౌకర్యార్థం ఐటీడీఏ సుమారు 30 ఏళ్ల క్రితం 25 గృహాలను నిర్మించింది. వీటిలో కొన్ని శిథిలదశకు చేరుకోగా, మరికొన్ని పూర్తిగా నేలమట్టమయ్యాయి. ఐదు భవనాల వరకు అంతంతమాత్రంగా ఉన్నాయి. నివాస గృహాలు అందుబాటులో ఉన్నప్పుడు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందించేవారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని ఉద్యోగులు ఉండేందుకు అద్దె ఇళ్లలు సైతం దొరక్కపోవడంతో మైదాన ప్రాంతాల నుంచి వస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించి, ఉద్యోగుల సౌకర్యార్థం నివాస గృహాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఘనంగా గౌరమ్మ ఉత్సవం

కశింకోట: స్థానిక డీపీఎస్ జిల్లా పరిషత్ హైస్కూలు వద్ద వెలసి ఉన్న గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) ఉత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు రథాన్ని లాగి ఉత్సవ ఊరేగింపును ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు పలువురు ప్రముఖులు వేర్వేరుగా గౌరమ్మను దర్శించుకున్నారు. ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి, ఆమె భర్త షణ్ముఖమూర్తి గౌరమ్మను దర్శించుకుని పూజలు చేశారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు అమ్మవారిని వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరిని ఉత్సవ కమిటీ సభ్యులు దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు, సీఐ రవికుమార్, ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తదితరులు గౌరమ్మకు పూజలు చేశారు. అమ్మ వారి ఊరేగింపు గ్రామ ప్రధాన వీధుల మీదుగా సాగింది. దారి పొడవునా ప్రజలు రథం ముందు బారులు తీరి గౌరమ్మకు పూజలు చేశారు.

వేడినీళ్లు పడి తల్లీ కొడుకులకు తీవ్రగాయాలు





ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్కు, విజయ

గూడెంకొత్తవీధి : వేడి నీళ్లు పడి తల్లీకొడుకుకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మురుగడ్డపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం గెమ్మెలి విజయ(30) కొత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతుంది. శనివారం తన ఇంట్లో మంట పెట్టుకుని వేడినీళ్లు కాస్తుండగా మంటలో పడిపోయింది. అదే సమయంలో ఆమె కుమారుడు లక్కుకు కూడా వేడి నీళ్లు శరీరంపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 సాయంతో చింతపల్లి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.